క్లుప్తంగా

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సంపేట : విద్యుత్ సరఫరాకు నేడు(సోమవారం), రేపు(మంగళవారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని నర్సంపేట విద్యుత్ ఆపరేషన్ డీఈ తిరుపతి, చెన్నారావుపేట విద్యుత్ ఏఈ జోగానంద్‌లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నారావుపేట మండలం పాపయ్యపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో లింగగిరి ఫీడర్ 33 కేవీ విద్యుత్ పునరుద్ధరణ పనుల దృష్ట్యా రెండు రోజుల పాటు మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

6న మెగా రక్తదాన శిబిరం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నర్సంపేట : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో ఈనెల 6న నిర్వహించే మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి కోరారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ అధ్యక్షతన ఆదివారం పట్టణ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం గ్రీన్‌స్టార్ హాస్పిటల్ ఆవరణలో నిర్వహించే శిబిరానికి నియోజకవర్గంలోని యువకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి, క్లస్టర్ బాధ్యులు, మాజీ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకుర్తిలో పోచమ్మ బోనాలు

గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తిహవేలి గ్రామంలో ఆదివారం పోచమ్మ బోనాల పండుగను జరుపుకున్నారు. మహిళలు ఆలయానికి బోనాలతో తరలివెళ్లి తమ కుటుంబాలను చల్లంగా చూడాలంటూ మొక్కుకున్నారు. గ్రామంలోని కులవృత్తులు బోనాలు సమర్పించారు. వారి తర్వాతే ఇతర కులస్తులు బోనాలను సమర్పించడం ఆచారంగా వస్తోంది.

బీఆర్‌ఎస్‌లో చేరిక

దుగ్గొండి : మండలంలోని తొగర్రాయి గ్రామానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకుడు బుసాని ఏకాంబరం ఆ పార్టీకి రాజీనామా చేసి ఆదివారం మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా పెద్ది మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్ల తిరక్కముందే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో అసహనం కనబడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు కాట్ల భద్రయ్య, ఓడేటి తిరుపతిరెడ్డి, యార శ్రీనివాస్, తుమ్మలపెల్లి మహేందర్, బుక్క సునిల్, బండ రాజు పాల్గొన్నారు.

పోచమ్మ ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక

దుగ్గొండి : మండలంలోని మర్రిపల్లి గ్రామంలో పోచమ్మతల్లి ఆలయ నిర్మాణం కోసం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా యార రవి, గౌరవ అధ్యక్షుడిగా ఇట్టబోయిన స్వామి, ఉపాధ్యక్షులుగా గాజు భిక్షపతి, ప్రధాన కార్యదర్శిగా శివాజీ, కార్యదర్శిగా వనయ్య, కోశాధికారిగా పెండ్లి రవి, కార్యనిర్వాహణాధికారిగా కొత్తపల్లి రమణాచారితో పాటు సభ్యులు ఎన్నికయ్యారు.

స్నేహితుడికి చేయూత



ఖానాపురం: మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన లతీఫ్ తల్లి జమాల్బీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. లతీఫ్‌ను పదో తరగతి స్నేహితులు ఆదివారం పరామర్శించారు. స్నేహితుడికి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. చేయూతనందించిన వారిలో మల్యాల మధుకర్‌రావు, నద్దునూరి కోటయ్య, తాళ్ల భిక్షపతి, ఐలయ్య, సుధాకర్, సబిత, వనజాత, దేవేందర్‌రావు, కృష్ణ, వేణుగోపాల్‌చారి, రమేష్, వెంకటనారాయణ ఉన్నారు.

ఆర్‌డీఎఫ్‌లో ఫ్రెషర్స్ డే

పర్వతగిరి : మండలంలోని కల్లెడ ఆర్‌డీఎఫ్ వనిత అచ్యుతపాయ్ విద్యాలయ జనరల్ అండ్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం సెకండియర్ విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డే సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఫస్టియర్ విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. ప్రిన్సిపాల్ ఎ.జనార్దన్ మాట్లాడుతూ కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని, మంచి ర్యాంకులు సాధించి ఉన్నత విద్యను పొందాలని కోరారు.

బీమా.. ఉపాధి కూలీలకు వరం

- రూ.2 లక్షల వరకు పరిహారం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



సంగెం మండలం షాపూర్‌లో ఉపాధిహామీ పని చేస్తున్న కూలీలు (ఫైల్)

సంగెం : గ్రామీణ ప్రాంతాల కూలీలకు ఉపాధి హామీ పథకం ఏడాదికి వంద రోజుల పాటు పనిని కల్పిస్తూ అండగా నిలుస్తున్నది. ఈ పథకాన్ని మహిళలే అధికంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. వేసవి కాలంలో వ్యవసాయ పనులు లేని సమయంలో ఉపాధి పనులకు డిమాండ్ మరింతగా పెరుగుతున్నది. రైతు సంక్షేమం కోసం చేపట్టే పనులతో పాటుగా ఇతర అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వాలు కూలీ రేటును పెంచుతున్నాయి. ప్రస్తుత ఏడాది గరిష్ట కూలీ రూ.307గా నిర్ణయించారు. జాబ్‌కార్డు పొందిన ప్రతీ ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి బీమా యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎవరైనా ఉపాధి కూలీ ప్రమాదవశాత్తు మరణించినా, వందశాతం వైకల్యం పొందినా వారికి రూ.2 లక్షల బీమా వర్తిస్తుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఉపాధి కూలీలందరు బీమా ప్రీమియం చెల్లించేలా ప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు ఉపాధి పని ప్రదేశాల్లో ఏదైనా కారణంతో మృతి చెందిన వారికి రూ.2.లక్షల బీమా చెల్లించేవారు. గాయపడిన వారికి కూడా వైద్య ఖర్చులకు సాయం అందేది. ప్రస్తుతం పని ప్రదేశాల్లో కాకుండా ప్రీమియం చెల్లించిన ప్రతీ కూలీకి బీమా చెల్లించనున్నారు.

పీఎంఎస్‌బీవై ద్వారా అమలు

మండలంలోని 33 గ్రామపంచాయతీల్లో మొత్తం 10,566 జాబ్‌కార్డులు మంజూరు చేయగా 20,476 మంది కూలీలు నమోదై ఉన్నారు. వీటిలో యాక్టివ్‌గా ఉన్న 7,605 జాబ్‌కార్డుల్లో 13,256 మంది కూలీలున్నారు. వీరిలో 6978 మంది మహిళలు, 6278 మంది పురుషులు ఉన్నారు. ఉపాధి హామీలో పనిచేసే కూలీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఉపాధి హామీ పనులు చేసే సమయంలో ఏదో ఒక చోట అప్పుడప్పుడు ఘటనలు జరుగుతూ గాయాల పాలవడంతో పాటుగా మృత్యువాత పడిన సందర్భాలు ఉన్నాయి. బీమా ప్రీమియం చెల్లించిన వారికి ప్రమాదవశాస్తు గాయాలై పనిచేయని స్థితిలో ఉన్న వారికి రూ.లక్ష, మృత్యువాత పడితే రూ.2లక్షల బీమా వర్తిస్తుంది. ఈ పథకంలో 18 నుంచి 79 ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులుగా నిర్ణయించారు. ఉపాధి కూలీ వ్యక్తిగత ఖాతా దరఖాస్తు ఫారం నింపి ఇచ్చి తన ఆధార్‌కార్డుతో అనుసంధానం చేయించుకుని ప్రతీ ఏడాది రూ.20 ఆటోమేటిక్‌గా కూలీ ఖాతా నుంచి డెబిట్ చేస్తుంది. ఈ వివరాలను ఉపాధిహామీ సిబ్బందిని అడిగి తెలుసుకోవాలి.

బీమాతో ప్రయోజనం



ఉపాధి హామీ కూలీలకు బీమా పథకాన్ని అమలు చేయడం మంచి పరిణామం. ఇప్పటి వరకు పని ప్రదేశాల్లో ఏదైనా కారణంతో మరణిస్తే రూ.2 లక్షల బీమా చెల్లించేవారు. ప్రస్తుతం పని ప్రదేశాల్లోనే కాకుండా ఇంటి వద్ద మరణించినా ప్రీమియం చెల్లించి ప్రతీ కూలీకి బీమా సొమ్ము చెల్లించనున్నారు.

– మనుగొండ జంపయ్య, ఉపాధిహామీ కూలీ, షాపూర్

ప్రీమియం కట్టిస్తున్నాం



ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన ప్రమాద బీమా సౌకర్యం విషయంలో అవగాహన కల్పిస్తున్నాం. కొందరికి ఇప్పటికే బ్యాంకులో రూ.20 ప్రీమియం తీసుకున్నవారికి కాకుండా తీసుకోని వారికి బీమా ప్రీమియం కట్టిస్తున్నాం. ఉపాధి కూలీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా మా టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు చూస్తున్నారు.

– గణేశ్, ఏపీఓ సంగెం

లబ్ధిదారులు నిబంధనలు పాటించాలి

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు నిబంధనలు పాటించాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని నాగారంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన మోసంతో గత పదేళ్లు విసిగి వేసారిన పేదోడి ఇంటి కల నెరవేర్చుతున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. మండలంలోని పైలట్ గ్రామం బొల్లికొండలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు తుది దశకు చేరాయన్నారు. త్వరలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డితో గృహ ప్రవేశాలు చేపడుతామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, కోశాధికారి కేవీ. సుబ్బారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాటి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు లక్ష్మణ్, మార్కెట్ డైరెక్టర్ రావుల మహిపాల్‌రెడ్డి, సోషల్ మీడియా ప్రతినిధి రావుల తిరుపతిరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, సుధాకర్ రెడ్డి, పాపిరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడంలో ఎమ్మెల్యే విఫలం

- మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు



ఎండిపోయిన కాల్వను పరిశీలిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఖానాపురం : ముందస్తు సాగు పేరుతో నీటివిడుదల చేసిన ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి కష్టకాలంలో రైతులను ఆదుకోవడంలో విఫలమయ్యారని మాజీ ఎంపీపీ ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్ ఆరోపించారు. మండలంలోని తుంగబంధం కాల్వను ఆదివారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా నెర్రెలు వారిన దుక్కులు, ఎండిపోతున్న నారుమడులను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ పాకాలలో 25 ఫీట్ల నీరు ఉన్నప్పటికీ ఆయకట్టు రైతులకు నీరందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రైతులు అరిగోస పడుతుంటే ఎమ్మెల్యే అడ్రస్ లేకుండా పోయాడన్నారు. అధికారుల నిర్లక్ష్యం, పాలకుల చేతగాని తనంతో రైతులకు నీరందడం లేదన్నారు. కాంట్రాక్ట్ పనుల కోసం ఎదురుచూసే స్థానిక కాంగ్రెస్ నాయకులు రైతులను ఆదుకునే ప్రయత్నాలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. అధికార పార్టీ నాయకులను నమ్ముకుంటే మునిగే పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు, నాయకులు స్పందించి రైతులకు నీరందించాలన్నారు. కార్యక్రమంలో సదర్‌లాల్, బాలునాయక్, లక్ష్మణ్, శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, రమేష్, రాము, సంపత్, భద్రు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆకర్షితులై చేరికలు



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి

నర్సంపేట: ప్రధాని మోదీ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై, రాష్ట్రం కూడా అభివృద్ధి పథంలో నడవాలంటే బీజేపీతోనే సాధ్యమని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి అన్నారు. చెన్నారావుపేట మండలం శంకరంతండాకు చెందిన వివిధ పార్టీలకు చెందిన 30 మంది కార్యకర్తలు ఆదివారం మండల అధ్యక్షుడు దామరుప్పుల శేఖర్ అధ్యక్షతన రాణాప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. రాణాప్రతాప్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు ఎక్కువ స్థానాల్లో అవకాశం కల్పించి ప్రజా ప్రతినిధులను చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ దుంకదువ్వ రంజిత్, ప్రధాన కార్యదర్శులు మురహరి విజయ్, కిసారి సాంబరాజు, జిల్లా బీజేవైఎం కార్యదర్శి ఎర్ర రాజు, శంకరతండా యూత్ అధ్యక్షుడు భూక్యా లచ్య, లింగన్న, మహిళా మోర్చా మండల నాయకురాలు బానోతు వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

రాయపర్తి: ఇటీవల మృతి చెందిన మండలంలోని జయరాంతండా(కె) గ్రామానికి చెందిన లావుడ్య వెంకన్న కుటుంబాన్ని పాలకుర్తి సోమనాథ ఆలయ చైర్మన్ టీఎం కృష్ణమాచార్యులు ఆదివారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థికసాయాన్ని అందించినట్లు చెప్పారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు తోట సుదర్శన్, జక్కుల సారంగం, గజ్జి వెంకటయ్య, గజ్జి చిన్నవెంకన్న, గ్రామపార్టీ అధ్యక్షుడు లావుడ్య ఉన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



యాకాంతం మృతదేహం

పర్వతగిరి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని ఏనుగల్లు గ్రామానికి చెందిన పెరుమాండ్ల యాకాంతంగౌడ్(45) తాగుడుకు బానిసై మద్యం మత్తులో ఆదివారం ఇంటివద్ద ఉన్న గుర్తుతెలియని గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఎంజీఎంకు తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం 10.55 గంటలకు మృతి చెందాడు. మృతుడి భార్య పెరుమాండ్ల సావిత్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు.

బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మహా సంపర్క్ అభియాన్ మండల కన్వీనర్ రాయపురపు కుమారస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ వికాసం బీజేపీతోనే సాధ్యమన్నారు. తెలంగాణలో మార్పు రాలే బతుకులు మారలే, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ దొందూ దొందే, పెంక నుంచి పొయ్యిలోకి తెలంగాణ, హిందూ విరోధి దేశ విరోధి తదితర సైడ్ హెడ్డింగ్‌లో కూడిన కరపత్రాలను ప్రతి ఇంటికి చేరవేర్చే కార్యక్రమాన్ని మహా సంపర్క్ అభియాన్‌లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మండలంలోని ఎంపీటీసీ స్థానాలకు ఒక్కొక్కరికీ బాధ్యతలు అప్పగించారు. దమ్మన్నపేటకు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండేటి శ్రీధర్, కట్ర్యాలకు మైస రాము, ఇల్లంద రెండు స్థానాలకు పెద్దూరి రాజ్‌కుమార్, బోయినపల్లి దేవేందర్‌రావు, నల్లబెల్లి చీపురు వెంకటస్వామి, చెన్నారం దోమకొండ శ్రీనివాస్, బండౌతపురం ఐత రవి, ల్యాబర్తికి శ్రీనివాస్, ఉప్పరపల్లి ఎలమకంటి గిరిబాబు, రామవరం శ్రీరాముల సంపత్‌కు బాధ్యతలు అప్పగించినట్లు వారు తెలిపారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షురాలు కొండేటి అనిత పాల్గొన్నారు.

సంఘాన్ని మరింత బలోపేతం చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న సాంబయ్య

నర్సంపేట : ప్రణాళిక ప్రకారం ఐకమత్యంతో ఒకే తాటిపై సమష్టిగా కృషి చేస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేస్తామని పద్మశాలి సంఘం పట్టణ అధ్యక్ష,కార్యదర్శులు గాజుల సాంబయ్య, బాల్నె జగన్ అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ నర్సంపేటలోని అన్ని వార్డుల్లో సభ్యత్వ నమోదు కార్యక్రమం విస్తృతంగా చేపడతామని తెలిపారు. మండల కన్వీనర్లను కలిసి వారితో ప్రతీ మండలంలో కమిటీలను ఏర్పాటు చేసి ప్రతీ ఒక్కరిని సమన్వయపరుస్తూ మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. రానున్న రోజుల్లో నర్సంపేట డివిజన్‌లోని చెన్నారావుపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, నెక్కొండ మండలాలతో పాటు ప్రతీ గ్రామంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తామని జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ రాంపెల్లి లింగమూర్తి తెలిపారు. కార్యక్రమంలో బాసాని సుదర్శన్, బలభద్ర రవీందర్, పెండెం భాస్కర్, ఆడెపు చంద్రశేఖర్, రాజయ్య, సమ్మయ్య, పరమేష్, రమేష్, రాజేందర్, సుధాకర్, మార్కెండేయ, సురేష్, చందర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

బాలిక చదువుకు ఆర్థికసాయం



నాగేశ్వరీకి ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

సంగెం : ఆర్థిక ఇబ్బందులతో చదువుకోలేక పోయిన బాలికకు వాసూరి ఫౌండేషన్ రూ.25 వేల ఆర్థికసాయం అందించి భరోసా ఇచ్చింది. మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన గొడుగు రమేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. రమేశ్ కుమార్తె నాగేశ్వరీ డిగ్రీ రెండో సంవత్సరం చదువుతోంది. గ్రామానికి చెందిన రిటైర్డ్ ఏసీపీ వాసం సురేందర్ ఈ విషయాన్ని అమెరికా టెస్లా కంపెనీలో ప్రాసెస్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న కుమారుడు వాసం విశ్వతేజకు తెలుపగా వాసూరి ఫౌండేషన్ ట్రస్ట్‌ను స్థాపించి ఆదివారం సొంత గ్రామంలో తల్లిదండ్రులు అరుణ, సురేందర్ దంపతులు, గ్రామపెద్దల సమక్షంలో నాగేశ్వరికి రూ.25 వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు భిక్షపతి, సాంబయ్య, మాజీ సర్పంచ్‌లు దడిగెల కొమ్మాలు, ఎనబోతుల సాంబయ్య, సదయ్య, సురేష్, సాంబయ్య, నాయకులు యాకయ్య, శ్రీను, సారయ్య, నరేశ్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటాం

- బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి



పల్లెబాట కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో పర్యటిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి: మండల ప్రజల కష్టసుఖాల్లో పాలు పంచుకోవడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు మండలంలోని గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని కొండూరు, తిర్మలాయపల్లి, తెట్టెకుంటతండా, బురహాన్‌పల్లి, బోజ్యాతండా, వాంకుడోతుతండా, జింకురాంతండా, ఎర్రకుంటతండా, జయరాంతండా(కె), మైలారం గ్రామాల్లో పల్లెబాట కార్యక్రమాన్ని నిర్వహించి ఇటీవల మృతిచెందిన మృతుల కుటుంబాలను, పలు కారణాలతో బాధపడుతున్న కుటుంబాలను పరామర్శించి ఓదార్చిధైర్యం చెప్పినట్లు చెప్పారు. అనంతరం బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం, బియ్యం, ఆయిల్‌క్యాన్‌లను అందించినట్లు చెప్పారు. అలాగే మైలారంలో చిర్ర కులస్తుల వినతి మేరకు ఎల్లమ్మగుడి నిర్మాణానికి రూ. 50వేలను అందించినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, మండల ప్రధానకార్యదర్శి పూస మధు, ఎస్టీయూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూక్య సురేందర్‌రాథోడ్, ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, బద్దం వేణుగోపాల్‌రెడ్డి, కర్ర రవీందర్‌రెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్నేహితుల దినోత్సవం



నర్సంపేట : పుస్తకాలకు ఫ్రెండ్‌షిప్ బాండ్ కట్టిన విద్యార్థులు



ఖానాపురం : ఎస్సై రఘుపతికి ఫ్రెండ్‌షిప్ బాండ్ కడుతున్న సౌమ్య



సంగెంలో చిన్నారుల సంబురాలు

నర్సంపేట : పట్టణంలోని లీడ్ గ్రంథాలయంలో స్నేహితుల దినోత్సవం వేడుకను ఆదివారం విభిన్నంగా నిర్వహించారు. విద్యార్థులు పుస్తకాలకు ఫ్రెండ్‌షిప్ బాండ్ కట్టి జీవితంలో పుస్తకాల ప్రాధాన్యతను తెలిపారు. ఈ సందర్భంగా లీడ్ గ్రంథాలయ వ్యవస్థాపకుడు కాసుల రవికుమార్ మాట్లాడుతూ పుస్తకాలను మించిన స్నేహితులు లేరని, ఒక మంచి పుస్తకం ఎన్నో జీవితాలను మార్చగలదన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు చిన్ననాటి నుంచే పుస్తకాల ప్రాధాన్యతను తెలియజేయాలని అన్నారు. సెల్ ఫోన్ చెరలో చిక్కుకుని విలవిలలాడుతున్న విద్యార్థులను విజ్ఞాన ప్రపంచం వైపు, పుస్తక ప్రపంచం వైపు తీసుకువెళ్లాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సన్వీ, సాహితిసిరి, దక్షిత, అన్విత, వివేక ఆదిత్య పాల్గొన్నారు.

ఖానాపురం : మండల వ్యాప్తంగా ఘనంగా స్నేహితుల దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్నేహితులు కలుసుకొని ఉత్సాహంగా గడిపారు. స్నేహితులు కేక్ కట్ చేసి వేడుకలను చేపట్టారు. మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో యూత్ బాధ్యులు వడ్డె రాజశేఖర్, విజయ్, సౌమ్య, శరణ్యప్రియలు ఎస్సై రఘుపతితో పాటు పోలీస్ సిబ్బందికి ఫ్రెండ్‌షిప్ బాండ్‌లు కట్టి వేడుకలను నిర్వహించుకున్నారు.

సంగెం : స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో చిన్నారులు ఫ్రెండ్‌షిప్ బాండ్‌లు కట్టుకుని సంబురాలు జరుపుకున్నారు. కల్లా కపటం ఎరుగని స్నేహాన్ని పెద్దలు ఆశీర్వదించారు.

రాజశేఖర్‌కు సేవారత్న అవార్డు



రాజశేఖర్‌కు అవార్డు అందజేస్తున్న కేయూ రిజిస్ట్రార్ రామచంద్ర

సంగెం : మండల కేంద్రానికి చెందిన సమాజ సేవకుడు పులి రాజశేఖర్‌కు బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వారు విశిష్ట సేవారత్న అవార్డును ఆదివారం అందజేశారు. రాజశేఖర్ కరోనా సమయంలో ఉచితంగా మాస్కులు, పేద కుటుంబాలకు కూరగాయల పంపిణీ, నిరుపేద కుటుంబాల్లోని వ్యక్తులు మరణించినపుడు వాట్సాప్ ద్వారా విరాళాలు సేకరించి కుటుంబాలకు అందజేశాడు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి సేవలందించాడు. ఆయన చేసిన సేవలను గుర్తించి అవార్డును అందజేశారు. కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రామచంద్ర, వెలాసిటీ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొండల్‌రెడ్డి, బెస్ట్ ఫ్రెండ్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్, సభ్యులు పులి రంజిత్, బోనాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

రాయపర్తి: మండలంలోని మైలారం ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించిన 2008–09 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు జి.భద్రయ్య, జీవీ రామన్, బొమ్మెర సోమయ్య, విజయలక్ష్మి, మీనా, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.